


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని  తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ  సంపుటి :05  సంచిక :118  ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్  ఆదివారం 23-08-2026  పేజీలు : 4  వెల : రూ. 3/-

## హామీలు అమలు చేయకుండా వేధింపులకు గురిచేస్తోంది



హైదరాబాద్,ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగులు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ఆ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేశారని, ఇప్పుడు వారినే ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఉద్యోగులు ముందుండి పోరాడారని, ప్రత్యేక రాష్ట్రంపై వారికి ఉన్న నిబద్ధతను అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా అభినందించారని గుర్తు చేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఉద్యోగుల నుంచి గత మూడు నెలలుగా 1.5 శాతం జీతం నుంచి కోత విధిస్తున్నారని, అయితే ఆ వివరాలను బహిరంగంగా వెల్లడించడం లేదని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కల్పించే ఈహెచ్ఎస్ పథకం సక్రమంగా పనిచేయకపోవడంతో ఆసుపత్రుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఉద్యోగుల నుంచి ఈహెచ్ఎస్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నప్పుడు.. ఆసుపత్రుల్లో ఆ సేవలు ఎందుకు అందుబాటులో లేవని ప్రశ్నించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ప్రయోజనాల కోసం నెలకు రూ. 2 వేల కోట్ల చెల్లింపులు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది వాస్తవం కాదని విమర్శించారు. పీఆర్సీ, డీఏలు ఈ ప్రభుత్వ హయాంలోనే అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని ఆరోపించారు.

ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులపై ప్రస్తావన

రాష్ట్రంలో లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని, వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి నెరవేర్చలేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల నిధుల విషయంలోనూ అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన అన్నారు. ఉద్యోగాల పేరుతో వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.

కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టిన శ్రీనివాస్ గౌడ్

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నాణ్యత లోపాలు లేవని సీడబ్ల్యూఆర్‌పీఎస్ నివేదిక స్పష్టం చేసిందని పేర్కొన్నారు. ఈ నివేదికతో కాళేశ్వరంపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం బయటపడిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, రాష్ట్రానికి అది కీలక ఆధారంగా మారిందని చెప్పారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు చేసే వరకు ఉద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఏ వర్గానికి అన్యాయం జరిగినా బీఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి. దేవీప్రసాద్, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, టీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నేత భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

## కొండా' ధీమా వెనుక శక్తులు ఏవరు?



హైదరాబాద్,సీఎం రేవంత్ రెడ్డిపై తిరుగుబాటు చేస్తున్న మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలో ఒంటరినా?..లేక ఆమె తిరుగుబాటు వెనుక ఉన్న శక్తులు ఎవరన్న చర్చ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్ లో హాట్ టాపిక్ గా మారింది. తరుచూ తన సొంత ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలతో తీవ్ర విభేదాలు ఎదుర్కొంటుండటంతో పాటు పలుమార్లు వివాదస్పద వ్యాఖ్యలతో కొండా సురేఖ, మురళి, సుస్మితా పటేల్ లు తాము ఇబ్బంది పడటంతో పాటు పార్టీని, ప్రభుత్వాన్ని కూడా ఇబ్బంది పెడుతున్నారంటూ ఆమె వ్యతిరేక వర్గీయులు విమర్శిస్తున్నారు. నాగార్జున– సమంత ఎపిసోడ్ లో, ఓఎస్డీ సుమంత్ వసూళ్ల ఆరోపణల వ్యవహారంలో నేరుగా రేవంత్‌నే టార్గెట్ చేసినప్పుడు కూడా కొండా సురేఖ వ్యతిరేక వర్గీయులు ఆమెపై మూకుమ్మడి దాడితో హడావుడి చేశారు.

గంభీరంగానే కొండా...

ఇప్పుడు కూడా కొండా వ్యతిరేక వర్గంతో పాటు రేవంత్ మద్దతుదారులైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొండా సురేఖకు వ్యతిరేకంగా బాహటంగానే మీడియా సమావేశం నిర్వహించి విమర్శలు చేయడంతో పాటు ఆమెను మంత్రి పదవి నుంచి తప్పించాలంటూ పార్టీ హైకమాండ్ ను కోరారు. తనకు వ్యతిరేకంగా ఇంతమంది గళం విప్పుతున్నా..కొండా సురేఖ మాత్రం గంభీరంగా నింపాదిగా వ్యవహరిస్తుండటం పార్టీ వర్గాలను అశ్చర్యపరుస్తుంది. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే తాను చెప్పాల్సినదంతా చెప్పానని..ఇంకా ఏదైనా ఉంటే సీఎం రేవంత్ రెడ్డిని కలిశాక చెబుతానంటూ ఆమె స్పష్టం చేశారు. కొండా సురేఖ వ్యవహారం ఆమె కోణంలోనే కాకుండా పార్టీలోని అంతర్గత ఆధిపత్య పోరుకు, అసలు కాంగ్రెస్..పసుపు కాంగ్రెస్ కు మధ్య నెలకొన్న విభేదాలకు కేంద్రంగా అధిష్టానం పరిశీలిస్తుంది.కాంగ్రెస్ సీనియర్ నేతగా, బీసీ నేతగా, వరంగల్ జిల్లాలో కీలక నేతగా కొండా కుటుంబం కొనసాగుతుండటంతో పాటు అచ్చ కాంగ్రెస్ వర్సెస్ పచ్చ కాంగ్రెస్ ఆధిపత్య పోరు నేపథ్యంలో కొండా సురేఖపై వేటుకు కాంగ్రెస్ హైకమాండ్ అంగీకరిస్తుందా? లేదా? అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది. సురేఖను హఠాత్తుగా బర్తరఫ్ చేస్తే తలెత్తే రాజకీయ పరిణామాలపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

కొండా సురేఖకు మద్దతుగా ఉన్న పెద్దలెవరు?

తనను మంత్రివర్గం నుంచి, పార్టీ నుంచి బర్తరఫ్ చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ఓవైపు పావులు కదుపుతున్నారని తెలిసినా..హైకమాండ్ సైతం కొండాపై చర్యలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ప్రచారం జరుగుతున్నా కొండా సురేఖ నుంచి కౌంటర్ ఎటాక్ కనిపించకపోవడం కాంగ్రెస్ శ్రేణులలో, రాజకీయ వర్గాలలోనూ ఆసక్తి రేపుతుంది. తన మంత్రి పదవి, రాజకీయ భవిష్యత్తు ఇబ్బందుల్లో పడబోతున్నా కూడా కొండా సురేఖ ఎందుకు స్పందించకుండా..ఎదురుదాడి చేయకుండా నింపాదిగా ఉన్నారన్నచర్చ సాగుతుంది. కొండాపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే ఎదురయ్యే పరిణామాలు ఏమిటి?...అదే జరిగితే కొండా స్పందన ఏ విధంగా ఉండబోతుంది?..కొండాకు మద్దతుగా పార్టీలో ఎవరు నిలబడుతారన్న చర్చ పార్టీ వర్గాలను ఊపేస్తుంది. కొండాకు మద్దతుగా పార్టీలోని సీనియర్లు, పలువురు మంత్రులు ఉన్నారని..మంత్రివర్గం నుంచి, పార్టీ నుంచి కొండాను బర్తరఫ్ చేస్తే ...ఆ తర్వాతా వారంతా రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా గళం విప్పేందుకు సిద్దంగా ఉన్నారన్న ప్రచారం వినిపిస్తుంది.

ఎవరి వెనుక ఎంత మంది ఉన్నారు..?

కొండా సురేఖకు వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డికి మద్దతుగా నిన్న మీడియా సమావేశంలో 66మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో కేవలం17మంది మాత్రమే హాజరయ్యారు. సీఎం రేవంత్ కోసం అతని మిత్రుడు ఎంపీ వేంరెడ్డి నరేందర్ రెడ్డి కనీసంగా 40మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రెస్ మీట్ కు హాజరు కావాలని ప్రయత్నించినప్పటికి 17మంది మాత్రమే ముందుకు వచ్చారని వ్యతిరేక వర్గం ఎత్తిచూపుతుంది. ప్రెస్ మీట్ కు హాజరైన ఎమ్మెల్యేలలో కూడా ఎంతమంది రేవంత్ పక్షాన కడవరకు గట్టిగా నిలబడుతారో లేదోనన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఓ రకంగా రేవంత్ రెడ్డికి పార్టీ ఎమ్మెల్యేలలో ఉన్న సంఖ్యా బలాన్ని ఈ పరిణామం చాటిచెప్పినట్లుగా ఉందని ప్రతిపక్షాలు చురకలేస్తున్నాయి. రేవంత్ రెడ్డికి అధిష్టానం వద్ద, ఎమ్మెల్యేలలో పట్టు సన్నగిల్లితే.. ఆయనపై కొండా సురేఖ బాటలోనే మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు తిరగబడవచ్చన్న ప్రచారం జోరందుకుంటుంది. కొండా సురేఖ, చిన్నారెడ్డి, రాజగోపాల్ రెడ్డిలపై చర్యలు తీసుకుంటే దాని ప్రభావం ఖచ్చితంగా రేవంత్ ప్రభుత్వం మనుగడపై పడుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు అప్పుడు రేవంత్ ప్రభుత్వానికి కీలకం కావచ్చుని..వారిలో కూడా పలువురు రేవంత్ పట్ల అసమ్మతితో ఉన్నారని విశ్లేషిస్తున్నారు.అటు కొండా సురేఖ వెనుక ఉన్న సీనియర్లు ఎవరన్నది చూస్తే..ఇప్పటివరకైతే బాహటంగా ఆమెకు మద్దతుగా

## నిషేధిత భూములు కోటి ఎకరాలకు ఎలా పెరిగాయి?

ఖమ్మం, ఆగస్టు 22 : ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కాంగ్రెస్ పార్టీ అంటేనే కబ్జాలు అనే పరిస్థితి నెలకొన్నదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శనివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, క్షమాపణలు చెప్పినంత మాత్రాన ప్రజలు ఈ చర్యలను ఎలా సహిస్తారని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ భూభారతి పేరుతో దోపిడీకి పాల్పడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షమాపణలు చెప్పి బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని 22గా నిషేధిత భూముల విషయంలో గతంలో 8, 9 లక్షల ఎకరాలుగా ఉన్న భూములు ఇప్పుడు కోటి ఎకరాలకు ఎలా చేరుకున్నాయో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రైతు రుణమాఫీ వంద శాతం పూర్తయిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెబుతున్నారని, అది నిజమని నిరూపించేందుకు ఏ గ్రామానికైనా వచ్చి రైతు రుణమాఫీపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. తన అంతు చూస్తానని మంత్రి వ్యాఖ్యలు చేస్తున్నారని, అయితే ముందుగా ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి కొరత, సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ కనీసం ముగ్గురు మంత్రులు ఈ అంశంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. రాజీవ్ సాగర్ నిర్మాణం పూర్తయిన ఏడాదికే లైనింగ్ కూలిపోయిందని, దీనిపై ప్రభుత్వం బాధ్యత వహించి ప్రజలకు సమాధానం చెప్పాలని ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.




కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అలవికాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చివేస్తూ ప్రభుత్వం పెడబొబ్బలు పెడుతోందని, పేదలను ఆదుకునేందుకు కృషి చేయకుండా వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో 23 ఎకరాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, కేబినెట్ ఆమోదంతో జీవో జారీ చేయించానని పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. అయితే జర్నలిస్టుల సంక్షేమం కోసం కనీస చర్యలు కూడా చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన విలువైన ఇళ్ల స్థలాలను జర్నలిస్టులకు కేటాయించడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజల ఆస్తులు, రైతుల సమస్యలు, పేదల ఇళు ,జర్నలిస్టుల సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన సమాధానం ఇవ్వాలని పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

## సహజ న్యాయసూత్రం ప్రకారం ఆ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదు




హైదరాబాద్, ఆగస్టు 22: కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని బీసీలను ఒకలా, రెడ్డిలను మరోలా చూడట్లేదని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. శనివారం) మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. కొండా సుస్మిత వ్యవహారంపై అధిష్ఠానం స్పందించిందని, ఈ మేరకు మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. దీనిపై మంత్రి సురేఖ వాట్సాప్ లో వివరణ లేఖను పంపినట్టు తెలిపారు. అయితే.. ఈ లేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో పార్టీ పెద్దలు చర్చిస్తున్నారని చెప్పారు.సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని పేర్కొన్న కొండా సురేఖ వివరణను మల్లు రవి వ్యతిరేకించారు. 'పార్టీకి వ్యతిరేకంగా ఒకరు మాట్లాడుతుంటే దేవదాయశాఖ మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ ఎందుకు స్పందించలేదు? పార్టీ సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఖండించాల్సింది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నారు?' అని ప్రశ్నించారు. కాగా.. గతంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.అలాగే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన అంశంపై కూడా మల్లు రవి స్పందించారు. ఈ విషయంపై ఇప్పటివరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని, సమయం వచ్చినప్పుడు ఆ అంశాన్ని సుమోటోగా స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

## లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో లివర్‌పూల్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, ఆగస్టు 22, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లండన్‌లో పర్యటిస్తున్నారు. లండన్‌లో పలువురు ప్రతినిధులతో సీఎం భేటీ అవుతున్నారు. ఈ మేరకు తెలంగాణ అభివృద్ధిపై చర్చిస్తున్నారు. ఈరోజు (శనివారం) లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్, ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సీఎంతో లివర్‌పూల్ ప్రతినిధులు చర్చించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి లివర్‌పూల్ ప్రతినిధులు ఆసక్తి చూపిస్తున్నారు. లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, క్రియేటివ్ ఎకానమీపై భాగస్వామ్యం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు లివర్‌పూల్ ప్రతినిధుల బృందం అక్టోబర్‌లో రానుంది. హైదరాబాద్ పర్యటనలో లివర్‌పూల్ భాగస్వామ్యంపై అధికారిక ఒప్పందానికి సన్నాహాలు చేస్తున్నారు.

లండన్ ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు: సీఎం సలహాదారు రామకృష్ణారావు

లండన్ ఇంపీరియల్ కాలేజీతో తెలంగాణ భాగస్వామ్యంపై చర్చలు జరిగాయని సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు తెలిపారు. ఇంపీరియల్ కాలేజీని సందర్శించామని అన్నారు. ఆ కాలేజీ ప్రతినిధులతో విద్యా సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించామని వెల్లడించారు. తెలంగాణలో షార్ట్‌టర్మ్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులపై పరిశీలిస్తున్నామని అన్నారు. పరిశోధన, విద్యార్థులు - అధ్యాపకుల మార్పిడిపై ఇంపీరియల్ ఆసక్తి



చూపిస్తోందని వివరించారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఇంపీరియల్ ప్రతినిధులకు ఆహ్వానించామని రామకృష్ణారావు చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ జరుగుతుందని తెలిపారు. గ్రాజువీ, బిజినెస్ విద్యలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థగా ఇంపీరియల్ కాలేజ్‌కి పేరొందని వెల్లడించారు. అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తెలంగాణ అభివృద్ధికి భాగస్వామ్య చర్చలు జరిగాయని వివరించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కార్యక్రమాలకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నట్లు రామకృష్ణారావు పేర్కొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తోంది.. కేంద్రంపై మంత్రి పొన్నం ఫైర్..

సిద్దిపేట: తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.'పల్లె పల్లెకు పొన్నం అన్న-పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్-2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకా రం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు.రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం



## సంపాదకీయం

ఆదివారం 23-08-2026

# వందేమాతరం తీవ్ర దుమారం

భారత జాతీయ గేయం వందేమాతరం చుట్టూ మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది న్యూఢిల్లీలో నాలుగు గంటలపాటు సుదీర్ఘంగా సాగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో, భవిష్యత్‌లో పార్టీ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే బీజేపీ కాంగ్రెస్‌ను లక్ష్యంగా పదునైన విమర్శలతో దాడి చేసింది. ఈ వివాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తమిళనాడులోని చెంగల్పట్టులో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ ప్రయోజనాలను, జాతీయ భావాలను తాకట్టు పెడుతోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నిర్ణయం కేవలం రాజకీయ స్వార్థంతో కూడుకున్నదని, ఇది దేశ విభజనకు పునాది వేసిన నాటి విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. మరోవైపు బీజేపీప జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ కాంగ్రెస్‌ను ఏకంగా కొత్త ముస్లిం లీగ్‌తో పోల్చారు. పార్లమెంట్ చేసిన చట్టాన్ని ధిక్కరిస్తూ కాంగ్రెస్ తన పాత విధానాలనే అమలు చేయాలని చూడటం విచారకరమని విమర్శించారు. దేశం గతంలో ఒకసారి వందేమాతరాన్ని రెండు భాగాలుగా విభజించే తప్పును అంగీకరించి తీవ్ర పరిణామాలను ఎదుర్కొంది. ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ మళ్లీ అదే విధమైన రాజకీయాలను ముందుకు తీసుకెళ్తోంది. వందేమాతరాన్ని రచించిన బంకిం చంద్ర ఛటర్జీని, స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను కాంగ్రెస్ అవమానిస్తోంది." అని అమిత్‌షా అన్నారు. రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. " దేశం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన వేలాది మంది అమరవీరులు ఈ వందేమాతర గేయాన్ని తమ శ్వాసగా మార్చుకొని పోరాడారు. అటువంటి పవిత్ర గేయాన్ని అవమానించడాన్ని కాంగ్రెస్ ఇప్పుడు తన అధికారిక పాలసీగా మార్చుకుంది" అని నబీన్ విమర్శించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా దేశ ఆత్మగౌరవాన్ని ఓటు బ్యాంకు రాజకీయాల వద్ద తాకట్టు పెట్టారని, అందుకే నేటి కాంగ్రెస్ సరికొత్త ముస్లిం లీగ్‌గా అవతరించినట్టు కామెంట్ చేశారు. ఈ వివాదం ఆగస్టు 15 వేడుకల సందర్భంగా మొదలైంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ సమయంలో ఎంపీ సోనియా గాంధీ వందేమాతరం పూర్తి గేయాన్ని పాడకుండా నిలిపివేయడానికి ప్రయత్నించారని బీజేపీ ఆరోపించింది. అయితే కాంగ్రెస్ ఈ ఆరోపణలను ఖండించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూర్చోవడానికి కుర్చీ వేయమని మాత్రమే సోనియా గాంధీ అడిగారని వివరణ ఇచ్చింది. అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య వందేమాతరం ఆలపించడంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం వివాదానికి మూలాలు దాదాపు 9 దశాబ్దాల క్రితం నాటి కాంగ్రెస్ తీర్మానం. కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ తాము కొత్తగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని 1937 నాటి కాంగ్రెస్ చారిత్రక కమిటీ సిఫార్సులనే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. వందేమాతరం గేయాన్ని బంకిం చంద్ర చటోపాధ్యాయ 1875లో సంస్కృతం, బెంగాలీ భాషల్లో రాశారు. ఇది మొదట 1875 నవంబర్ 7న బంగదర్శన్ అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత 1881లో ఆయన రాసిన ఆనందమఠ్ నవలలో చేర్చారు. ఈ నవల బెంగాల్ ప్రాంతం బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు బ్యాక్‌గ్రౌండ్‌లో సాగుతుంది. 1905 నాటి స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం భారతీయుల ప్రధాన సమరనాదంగా మారింది. అయితే 1937 అక్టోబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష చంద్రబోస్‌కు రాసిన లేఖలో వందేమాతరం నవల ముస్లింలలో కొన్ని ఆందోళలను కలిగిస్తోందని పేర్కొన్నారు. అదే సమయంలో ఈ అభ్యంతరాలు అధిక శాతం మతోన్మాధులు సృష్టించినవని కూడా నెహ్రూ అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయాన్ని కోరారు. ఠాగూర్ ఈ గేయంలోని మొదటి రెండు చరణాలను, మిగిలిన చరణల నుంచి వేరు చేసి చూడాలని సూచించారు. ఠాగూర్ ఇచ్చిన ఈ సలహాతో 1937 అక్టోబర్‌లో మహాత్మా గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వల్లభాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్ వంటి ప్రముఖులతో కూడిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక కీలక తీర్మానం చేసింది. జాతీయ సభలలో వందేమాతరాన్ని ఆలపించేటప్పుడు కేవలం మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని ఆ తీర్మానంలో సిఫార్సు చేశారు. గాంధీ కూడా 1939 జులై నాటి హరిజన్ పత్రికలో వ్యాసం రాస్తూ... స్వదేశీ ఉద్యమంలో వందేమాతరం హిందూ-ముస్లింలను ఏకం చేసిన గొప్ప సమరనాదం అని పేర్కొన్నారు. కానీ, దీనిని బలవంతంగా రుద్దడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఎవరైనా అభ్యంతం చెబితే సదస్సుల్లో పాడటం నిలిపివేయవచ్చని, వివాదాలకు తావు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు. వందేమాతరం పూర్తి గేయం మొత్తం ఆరు చరణాలు ఉన్నాయి. జాతీయ గేయంగా అధికారిక హోదా పొందిన కేవలం మొదటి రెండు చరణాలు మాత్రమే. ఇందులో దేశ ప్రకృతి అందాలు, నదీ జలాలు, పచ్చని పంట పొలాలు, ఫలసాయాన్ని వర్ణిస్తూ మాతృభూమికి ప్రణామాలు అర్పిస్తారు. దీనిపై ఎవరికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. కానీ 3,4, 5, 6 చరణాల చుట్టూ వివాదాలు నడుస్తున్నాయి. మూడో చరణంలో మాతృభూమి రక్షణ కోసం కోట్ల కొద్ది చేతులు కత్తులు పట్టుకొని సిద్ధంగా ఉన్నాయని యుద్ధ సంకేతాలు ఇస్తుంది. నాల్గో ఐదో చరణాలు మాతృభూమిని దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీ దేవీ హిందూ దేవతలతో పోల్చి పూజిస్తారు. ముస్లిం అభిప్రాయం ప్రకారం ఇస్లాంలో కేవలం అల్లా తప్ప మరెవరినీ పూజించకూడదు. మాతృభూమిని దేవతగా ఆరాధించడం ఇస్లాం సిద్ధాంతాలకు విరుద్ధమని వారి వాదన. ఈ వివాదం ఈనాటిది కాదు. గత ఏడాది డిసెంబర్‌లో వందేమాతరం 150 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా పార్లమెంటులో చర్చ జరిగింది. లోక్‌సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ... నెహ్రూ ముస్లీం లీగ్ ఒత్తిడికి తలొగ్గి వందేమాతరాన్ని కుదించారని ఆరోపించారు 1937లో జిన్నా అభ్యంతరం చెప్పినప్పుడు నెహ్రూ దీనిపై వెనక్కి తగ్గారని మోదీ విమర్శించారు. దీనికి కౌంటర్‌గా ప్రియాంకా మాట్లాడుతూ.. నెహ్రూ రాసిన లేఖలోని పూర్తి భాగాలను ప్రస్తావించారు. ముస్లిం లీగ్ చేస్తున్న ఆందోళనలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని నాడే చెప్పారని గుర్తు చేశారు. అదే సమయంలో వందేమాతరాన్ని బలవంతంగా రుద్దడం మంచిది కాదని విపక్షాలు అభిప్రాయపడ్డాయి. వందేమాతరాన్ని అవమానించం లేదా దాని ఆలాపనను అడ్డుకోవడాన్ని పార్లమెంట్ నేరంగా పరిగణిస్తూ చట్టాన్ని తెచ్చింది. అనంతరం కేంద్రప్రభుత్వం జాతీయ గేయానికి సంబంధించి తొలిసారిగా అధికారిక ప్రోటోకాల్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయంలోని మొత్తం ఆరు చరణాలను ఆలపించడాన్ని తప్పనిసరి చేసింది. కేంద్రం తెచ్చిన కొత్త రూల్స్ ప్రకారం అధికారిక కార్యక్రమాల్లో ఆరు చరణాలు పాడాల్సి ఉండగా, కాంగ్రెస్ తన సొంత పార్టీ వేడుకల్లో మాత్రం

# కాంగ్రెస్ లో పాత రోజులు..



హైదరాబాద్, కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని చెప్పుకుంటూ ఉంటారు. అసంతృప్తి ప్రకటనలు చేసే వారికి ఈ పేరు పెట్టుకున్నారు. ఇప్పుడీ కాంగ్రెస్ మార్క్ అంతర్గత ప్రజాస్వామ్యం హద్దులు దాటి పోతోంది. రాజగోపాల్ రెడ్డి నిరంతరం వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. అనిరుధ్ రెడ్డితో పాటు ఇటీవల చిన్నారెడ్డి కూడా అదే చేశారు. తాజాగా సుస్మితా పటేల్ సంచలనం సృష్టించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర రాజకీయ కలకలాన్ని రేపాయి. సీఎం రేవంత్‌కు పార్టీ సిద్ధాంతాలు ఇంకా వంటబట్టలేదని, కాంగ్రెస్ క్రమంగా టీడీపీ కాంగ్రెస్ గా మారుతోందని ఆరోపిస్తూ ఆమె నేరుగా తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన ఒక కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ టికెట్ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మాకు టికెట్ నిరాకరించడానికి అసలు రేవంత్ రెడ్డి ఎవరు? టికెట్ల కేటాయింపు అధిష్టానం పరిధిలోని అంశం అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను స్వతంత్రంగానైనా పోటీ చేసి గెలిచి తీరుతానని సవాల్ విసిరారు. ఆనాడు రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు కావాలని మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేస్తూ, కొడంగుల్ లో ఓడిపోయిన విషయాన్ని సీఎం మరిచి పోవద్దంటూ అత్యంత ఘాటైన స్వరంతో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ స్థాయికి చేరిందో స్పష్టంచేస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలు ఇదివరకే వేర్వేరు సందర్భాల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కగా, ఇప్పుడు కొండా సురేఖ కుటుంబం నేరుగా సీఎంపైనే విమర్శల బాణాలు విసరడం శాసనసభా పక్షంలో సంచలనంగా మారింది. పార్టీలోని పాత కాంగ్రెస్ నేతలు, బీసీ నాయకులను పక్కనబెట్టి, వలస నేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఈ వరుస తిరుగుబాట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు పీసీసీ క్రమశిక్షణా కమిటీ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిస్సహాయంగా మారిపోయారు. బహిరంగంగా పార్టీ సిద్ధాంతాలను, ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం పార్టీలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని ఎంపీ మల్లు రవి వంటి నేతలు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసమ్మతి నేతలను అదుపు చేయడంలో గాంధీ భవన్ నాయకత్వం పూర్తిగా వెనుకబడి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనాపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నప్పటికీ, సొంత కేబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్రమైన విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ ఘర్షణ వాతావరణం, ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని పార్టీలోని అంతర్గత పోరుకు చెక్ పెట్టకపోతే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మరియు క్రెడిబిలిటీకి పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.

### రేవంత్ ఫెయిలవ్వుతున్నారా

తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పుడు పరిపాలన కంటే పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే పెను సవాలుగా మారుతున్నాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శించిన నాయకత్వం.. సొంత పార్టీలోని సీనియర్లు, వలస నేతల అసంతృప్తిని దారికి తేవడంలో మాత్రం తడబడుతోందనే వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధిష్టానాన్ని నేరుగా టార్గెట్ చేయకుండా, కేవలం సీఎం రేవంత్‌ను మాత్రమే కేంద్రబిందువుగా చేసుకుని నేతలు సాగిస్తున్న స్వరం రోజురోజుకూ శృతిమించుతోంది. ఎన్నికల సమయంలో తన అనుకూల వర్గానికి టికెట్లు ఇప్పించుకుని, వారిని గెలిపించుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచీ రేవంత్‌పై ఉన్నాయి. ఆ సమయంలో అధికారమే లక్ష్యంగా అంతా సర్దుకుపోయినా, ప్రభుత్వం ఏర్పడ్డాక సీనియర్లను విస్మరిస్తున్నారనే భావన పాత కాంగ్రెస్ నేతల్లో అసహనాన్ని పెంచింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడం, నామినేటెడ్ పదవుల జాప్యం, పార్టీలో ప్రాధాన్యం తగ్గడం వంటి అంశాలు అంతర్గత అసంతృప్తిని రాజేస్తున్నాయి. కేబినెట్ పదవి ఆశించి భంగపడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొదటి ఏడాది నుంచే సీఎంను లక్ష్యంగా చేసుకుని గళమెత్తుతున్నారు. సీఎం మార్పు ప్రస్తావన తెస్తూ, ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నామనే సంకేతాలు ఇవ్వడం ప్రభుత్వ స్థిరత్వంపై చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్లు నిధుల కొరత, నిర్లక్ష్యంపై బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. దానం నాగేందర్ లాంటి నేతలు గత పాలనను ప్రస్తావిస్తూ ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేత చిన్నారెడ్డి టికెట్ల కేటాయింపు వ్యవహారాలపై విమర్శలు గుప్పించగా, పార్టీ వీడిన జీవన్ రెడ్డి తరచూ సీఎం శైలిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. విజయశాంతి ప్రభుత్వ విధానాలపై పెదవి విప్పగా, తాజాగా మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ఏకంగా పరకాల టికెట్ కేటాయింపు, కుటుంబానికి ఎమ్మెల్సీ నిరాకరణ వంటి అంశాలపై సీఎం కుటుంబ సభ్యులను సైతం టార్గెట్ చేస్తూ స్వతంత్ర పోరుకు సిద్ధమవడం ప్రకంపనలు సృష్టిస్తోంది. అసమ్మతి స్వరాలు పెల్లుబుకుతున్నప్పుడు వాటిని బుజ్జగించడం లేదా సమన్వయ కమిటీల ద్వారా పరిష్కరించడంలో అధిష్టానం, సీఎం స్థాయి సంప్రదింపులు కొరవడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపు ప్రతిపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలను రాజకీయంగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు.. సొంత పార్టీ నేతల అసంతృప్తి వ్యాఖ్యలే ప్రతిపక్షాలకు ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. కేటీఆర్, హరీశ్ రావు వంటి విపక్ష నాయకులు కాంగ్రెస్ అసమ్మతి నేతల వ్యాఖ్యలనే కోట్ చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు. ముఖ్యమంత్రిగా పరిపాలనపై పట్టు సాధిస్తున్నప్పటికీ, సొంత గూటిలోని అసమ్మతిని ఒకే తాటిపైకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్నది స్పష్టమవుతోంది. తక్షణమే సమన్వయ యంత్రాంగాన్ని బలోపేతం చేసి, అంతర్గత కుమ్ములాటలకు తెరదించకపోతే.. ఈ అంతర్గత అసంతృప్తే ప్రభుత్వ ఉనికికి రాజకీయంగా గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉంది.

# ఉనికి కోసమే జగన్ ఆరాటం !



విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న వరుస నియోజకవర్గాల సమీక్షా సమావేశాల్లో కేడర్‌నుద్దేశించి ఆయన చేస్తున్న ప్రసంగాలు దీనిని స్పష్టం చేస్తున్నాయి. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి పంచాయతీ, వార్డులో తప్పనిసరిగా నామినేషన్లు వేసి తీరాలని ఆయన పార్టీ శ్రేణులను ఆదేశిస్తున్న తీరు.. పార్టీ బలమైన స్థితిలో ఉండి ఇచ్చే పిలుపులా కాకుండా, కనీస రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న తాపత్రయంలా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఒత్తిడి వెనుక బలమైన రాజకీయ భయం దాగి ఉంది. ఒకవేళ స్థానిక ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నిలబడకపోతే, క్షేత్రస్థాయిలో కేడర్ పూర్తిగా నిర్లిప్తతలోకి జారిపోయిందన్న స్పష్టమైన సంకేతం ప్రజల్లోకి వెళ్తుంది. అసెంబ్లీలో 11 సీట్లకు పరిమితమైన తర్వాత, పార్టీ ఇంకా సజీవంగానే ఉందని నిరూపించుకోవడానికి చేపట్టే పర్యటనలు, రోడ్‌షోలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు అన్నీ ఒక్కసారిగా తేలిపోతాయి. ఎన్నికల్లో పోటీ లేకపోవడం వల్ల ప్రత్యర్థి పక్షాలకు ఏకగ్రీవాలు దక్కితే, అది పార్టీ నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తుందనే భయంతోనే ఓడిపోయినా పర్వాలేదు.. బరిలో నిలబడండి అనే నినాదాన్ని ఆయన ముందుకు తెస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల మానసిక స్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ఐదేళ్ల అధికార కాలంలో సంక్షేమ పథకాల బటన్ల పంపిణీకి ఇచ్చిన ప్రాధాన్యత పార్టీకి అండగా నిలిచిన ద్వితీయ శ్రేణి నాయకులకు, సాధారణ కార్యకర్తలకు దక్కలేదనే అసంతృప్తి వారిలో బలంగా ఉంది. పాలనా వ్యవహారాల్లో అక్రమాలు, దందాల ఆరోపణలు ఎదుర్కొన్న పెద్దలు ఇప్పుడు సురక్షితంగా ఇళ్లకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల నుంచి వచ్చే రాజకీయ ఒత్తిళ్లను, కేసులను తామే భరించాల్సి వస్తోందని కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలో పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాకపోవడం, కొత్తగా సొంత జేబుల నుంచి లక్షలు ఖర్చుపెట్టి పోటీ చేసే ఆర్థిక స్తోమత లేకపోవడం కేడర్‌ను వెనుకడుగు వేసేలా చేస్తోంది. గ్రామస్థాయిలో ప్రత్యర్థులతో ఘర్షణ పడి ఆస్తులు, వ్యాపారాలను నష్టపోవడం కన్నా.. స్థానికంగా సర్దుబాటు రాజకీయాలు చేసుకోవడం లేదా మౌనంగా ఉండటమే మేలనే భావన వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో నాయకత్వం నుంచి ఎలాంటి రక్షణ భరోసా లభించనప్పుడు, కేవలం పార్టీ పరువు కాపాడటం కోసం తాము బలిపశువులం కాలేమనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది. కార్యకర్తల్లోని ఈ నైరాశ్యాన్ని గుర్తించినందువల్లే జగన్ వారిని ప్రత్యేకంగా పిలిపించి బతిమాలుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అగ్రనాయకత్వం తన ఉనికిని చాటుకోవడానికి చూస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నాయి

### ఏకగ్రీవం అనుకోవద్దు..

స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేలా ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రంగంలోకి దిగారు. రాష్ట్రంలో అన్ని స్థానాలకు పోటీచేయాలని, ఏ ఒక్క స్థానం ఏకగ్రీవం కాకూడదని ఇప్పటికే నియోజకవర్గ ఇంచార్జులకు ఆదేశాలిచ్చిన జగన్ రెడ్డి తాజాగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొద్దిరోజుల్లో నిర్వహించే స్థానిక ఎన్నికల్లో విజయం కోసం వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు పోలీసులను ప్రయోగిస్తారని, వారిని ఎదుర్కొని యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారుప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్న ఆయన పార్టీ కేడర్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునివ్వడం ద్వారా ఎన్నికల్లో రాజీ లేని పోరాటం చేస్తామని సంకేతాలు పంపుతున్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా, ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని, ఈ కారణంగా స్థానిక ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి ఓటేస్తారని జగన్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జగన్ సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకోవాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో గతంలో తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. "పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి" అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి, యుద్ధప్రాతిపదికన ఎన్నికలకు సిద్ధం కావాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఏడాదిలో పాదయాత్ర రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మరోసారి తన పాదయాత్రపై ప్రకటన చేశారు. ఏడాది తర్వాత తాను పాదయాత్ర చేస్తానని, ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత వైసీపీనే అధికారంలోకి వస్తుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అయితే స్థానిక ఎన్నికల్లో అది కనిపించకుండా ఉండేందుకు పోలీసులను వాడుకుంటారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ప్రకాశంలో ఫ్యాన్ రెక్కలు కకావికలం

ఒంగోలు,రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయాయి. 2024 ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 8నియోజకవర్గాల్లో 6 స్థానల్లో టీడీపీ కూటమి విజయం సాధించింది. అప్పటివరకు అధికారంలో వున్న వైసీపీ కేవలం రెండు చోట్ల మాత్రమే అతి కష్టం మీద గెలిచింది. ఒంగోలు పార్లమెంట్ స్థానంలో కూడా టీడీపీ జెండా ఎగరేసింది. ఇది అందరికీ తెలిసిందే. ఈ రెండేళ్ల కాలంలో టీడీపీ బలం ఏమాత్రం తగ్గిన దాఖలాలు లేవు. వైసీపీ పుంజుకున్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఇంకా చెప్పాలంటే ఘోర ఓటమి నుంచి వైసీపీ ఇంకా కోలుకోలేదు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి నాయకత్వం లేకుండా పోయిన పరిస్థితి కనిపిస్తుంది. ఒంగోలు పార్లమెంట్ కు కనీసం ఇంచార్జిని కూడా నియమించుకోలేని దీనస్థితిలో కొట్టు మిట్టాడుతోంది. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నాలుగు రోజులు హడావుడి చేసినప్పటికి ఇప్పుడు ఇటు వైపు తొంగిచూడటం లేదు. ఈసారి ఎన్నికల్లో కొత్తగా అభ్యర్థిని వెదుక్కోవాల్సిన దుస్థితి వుంది. ఇక ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయాక కార్యకర్తలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. చుండూరి రవిబాబు ఇంచార్జిగా పనిచేస్తున్నప్పటికీ పార్టీ శ్రేణులకు నమ్మకం కలిగించలేక పోతున్నాడు. కొండపి నియోజకవర్గంలో మరో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఇష్టం లేని కాపురం చేస్తున్నారు. మాటి మాటికీ పాత ఇంటి వైపు తొంగి చూస్తున్నారు. గిద్దలూరులో కుందూరు నాగార్జున రెడ్డి పరిస్థితి కూడా అంతే. ఆయనకు మార్కాపురం మీదనే మనసుంది. గిద్దలూరులో పోటీ చేస్తే గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అన్నా రాంబాబు మార్కాపురం వదిలి పెట్టనని మంకు పట్టు పడుతున్నారు. ఎర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కు ఆదిమూలపు సురేష్ తలనొప్పిగా తయారయ్యాడు. దర్శిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్ కు పార్టీలో సమస్య లేదు కానీ టీడీపీ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. కనిగిరిలో దద్దాల నారాయణను బలవంతంగా కొనసాగిస్తున్నారని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నారు. ఇకపోతే అద్దంకి నియోజకవర్గం వైసీపీకీ మింగుడు పడటం లేదు. 2019లో కూడా అక్కడ గొట్టిపాటి రవికుమార్ టీడీపీ జెండా ఎగరేశారు. ఇప్పుడు మంత్రిగా మరింత పట్టు సాధించారు. ఇక్కడ వైసీపీకి సీజన్ కు ఒకరు చొప్పున ఇంచార్జిలు మారుతున్నారు. ప్రస్తుతం అశోక్ కుమార్ ఇంచార్జిగా వున్నారు. ఈయన కొనసాగుతారో, కొత్త ఇంచార్జి వస్తాడో కేడర్ కు తెలియదు. కొండపిలో కూడా వైసీపీకి ఒక ఇంచార్జి లేడు. పార్ట్ టైమ్ లీడర్ గా సురేష్ వ్యవహారిస్తున్నట్లు కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. ఒంగోలు ఎంపీ సీటు ఖాళీగా వుంది. ఇలాంటి పరిస్థితిలో పార్టీ ఎప్పటికి కోలుకుంటుందో ఏమో అని వైసీపీ శ్రేణులు గొనుక్కుంటున్నారు.

# ఏపీలోనూ 22 ఏ ప్రకంపనలు

విజయవాడ, మాజీ ఐపీఎస్ అధికారి, ఏపీ ఇంటెలిజెన్స్ పూర్వ అధిపతి ఏబీ వెంకటేశ్వరరావు ఇటీవల ఏపీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా 22ం నిషేధిత భూముల జాబితా పరిరక్షణ ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన వేధింపులకు, సస్పెన్షన్‌కు గురై సత్యమేవ జయేతే అంటూ పోరాడిన ఆయన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీలోకి చేరకపోవడం, పైగా పాలనా లోపాలపై గళమెత్తడం వెనుక అసలు ప్లాన్ ఏంటనేది ఆసక్తికర చర్చకు దారితీసిందిఏబీ వెంకటేశ్వరరావును టీడీపీ పార్టీలోకి చేర్చుకోనందుకే ఆయన అసంతృప్తితో విమర్శలు చేస్తున్నారు. తాను టీడీపీలో చేరాలని గతంలో అనుకున్నప్పటికీ సరైన స్పందన రాలేదని ఆయనే పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినా ఆయన తీసుకోలేదు. అందుకే ఆ తర్వాత ఆయన మరికొంత మంది ఇతరులతో కలిసి సెంటర్ ఫర్ లిబర్టీ అనే వేదిక ద్వారా 22ం నిషేధిత భూముల జాబితా కారణంగా నష్టపోతున్న లక్షలాది మంది ప్రజల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ స్థాయి నేతలకు అధికారుల వాస్తవాలు సరిగ్గా చేరవేడం లేదని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ భూముల సమస్య ప్రజా ఉద్యమంగా మారడంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే ఆయుధంగా దీనిని మలుచుకున్నారు. రోల్ బ్యాక్ 22ం పేరుతో ఉద్యమం చేస్తున్నారు. ఇక సొంత పార్టీ ఏర్పాటు ప్రకటన విషయానికి వస్తే, ఏబీ వెంకటేశ్వరరావు తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదో ఒక రాజకీయం వెనుక నడవడం కంటే సమాజంలో మార్పు కోసం, పౌర హక్కుల పరిరక్షణ కోసం తమ భావసారూప్యత కలిగిన వ్యక్తులతో కలిసి కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని ప్రకటించారు. అధికారం పొందేందుకు కాకపోయినా, ఒక బలమైన వాచ్‌డాగ్‌గా, ఒత్తిడి గ్రూప్‌గా పనిచేయడానికే ఈ నూతన వేదిక ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ ఇలాంటి మాజీ అధికారులను , సానుభూతిపరులను ఎందుకు దూరం చేసుకుంటోందనే ప్రశ్నకు రాజకీయ వ్యూహాలే సమాధానంగా కనిపిస్తున్నాయి. మాజీ అధికారుల స్వేచ్ఛా ప్రకటనలు ప్రభుత్వ నిర్ణయాలకు అవరోధంగా మారడం, లేదా పార్టీకి క్యాడర్ ఆధారిత నాయకత్వమే ప్రాధాన్యత కావడం ఇందుకు కారణం కావచ్చు. అదే సమయంలో, సుదీర్ఘకాలం ఇంటెలిజెన్స్ వైపు పనిచేసిన అనుభవం ఉన్న వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని నియంత్రించే లోపాలను పసిగట్టి వేలెత్తి చూపిస్తుండటంతో కూటమి సర్కారుకూ ఇది ఇబ్బందికరంగా పరిణమించింది. తన చట్టపరమైన పోరాటం ముగిసిన తర్వాత, సమాజంలో ఒక ఇండిపెండెంట్ లీడర్‌గా, ప్రజా సమస్యలపై పోరాడే సివిల్ సొసైటీ వాయిస్‌గా తనను తాను నిలబెట్టుకునేందుకు వేస్తున్న వ్యూహాత్మక అడుగుగా దీనిని చూడొచ్చు.

## కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో 18 వా కరాటే కాంపిటేషన్

హైదరాబాద్ ,యూసఫ్ గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన 18 వా కాంపిటేషన్ నిర్వహించారు. దాదాపు 500 మంది కరాటే జపాన్ కరెక్టే కి సంబంధించిన మాస్టర్లతో పాటు యువకులు యువతులు పాల్గొన్నారు. జపాన్ నుంచి వచ్చిన ముఖ్యఅతిథి తనయమ షిశాన్ హోకీ జూమ్ రాసిన షిశాన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ప్రతి ఒక్క యువకుడికి ఆత్మ రక్షణ కోసం కరటే నేర్చుకోవాల్సిందే అని జపాన్ కి సంబంధించిన మాస్టర్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలకి యువతులకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకుని ఎక్కడ ఎలాంటి సంఘటన తన పైకి వచ్చినప్పుడు ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలని జపాన్ కరాటే అసోసియేషన్ వారు గత 18 సంవత్సరాల నుండి తెలంగాణ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. యువకులని ప్రోత్సహించడానికి కాంపిటేషన్లు కూడా నిర్వహిస్తున్నారా అన్నారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ప్రాక్టీస్ నిర్వహించిన తర్వాత రెండో రోజు

# ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు

జగిత్యాల,దశాబ్దాలుగా అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దే భవనాల్లోనే పరిపాలన కొనసాగుతూ వస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పొంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఇదే పరిస్థితి. గత పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన పాలకులు వీటిని పట్టించుకున్న పాపనపోలేదు. దీంతో పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు వేగవంతమైన, మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించాలనే గొప్ప సంకల్పంతో సమీకృత శాశ్వత భవనాల ఆలోచన మార్గమని నూతన ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు ప్రజాప్రభుత్వం శ్రీకారంచుట్టిందని అన్నారు. అందులో భాగంగా ఈరోజు జగిత్యాల జిల్లాలో సహచర మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎమ్మెల్సీ ఎల్ రమణ , ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు , జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పలు ప్రభుత్వ నూతన కార్యాలయాల భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల మున్సిపాలిటీలో రూ. 2.25 కోట్లతో నిర్మించనున్న ఆర్డీఓ కార్యాలయం, రూ. 2.25 కోట్లతో మెట్పల్లి మున్సిపాలిటీలో నిర్మించే ఆర్డీఓ కార్యాలయం, అదేవిధంగా రూ. 2.25 కోట్లతో ఎండపల్లిలో, రూ. 2.25 కోట్లతో భీమారం లో నిర్మించనున్న తహసిల్దార్ కార్యాలయాలతో పాటు రూ. 1.40 కోట్లతో ముత్యంపేటలో నిర్మించనున్న మల్యాల సబ్రిజిస్ట్రార్ కార్యాలయం, రూ. 1.40 మెట్పల్లి సబ్రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని అన్నారు.ఇప్పటికే హైదరాబాద్ ఉఊఓఅ పరిధిలో అత్యంత అధునాతన హంగులతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. వీటిని కూడా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంతరి సూచించారు.

# రైతు పోరుబాటకు శ్రీకారం

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు పట్టణంలో రైతుల సమస్యల పరిష్కారం, ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలకు అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో "రైతు పోరుబాట" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతు మిత్రులు, రైతులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, కర్నూలు జిల్లా పరిశీలకుడు తేర్నేకల్ సురేంద్ర రెడ్డి , స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు బి.ఆర్. బసి రెడ్డి హాజరయ్యారు.కార్యక్రమంలో భాగంగా తొలుత దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారు, పార్టీ నాయకులు, రైతులతో కలిసి పూలమాల నివాళులర్పించారు. అనంతరం రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ వైయస్ఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా ఎల్ఎల్‌సీ కార్యాలయం వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో రైతులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని రైతులకు సాగునీరు విడుదల చేయాలని నినదించారు.


రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

? తేర్నేకల్ సురేంద్ర రెడ్డిఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, కర్నూలు జిల్లా పరిశీలకులు తేర్నేకల్ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందని మండిపడ్డారు. రైతులు ఎంతో కష్టపడి పంటలు సాగు చేసుకున్న సమయంలో వారికి అవసరమైన సాగునీటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఎల్ఎల్‌సీ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.డ్యామ్‌లో నీరు ఉన్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు? ? బి.ఆర్. బసి రెడ్డిస్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు బి.ఆర్. బసి రెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్‌లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంత రైతులకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.రైతులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఖర్చుల కోసం పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసుకున్నారని, ఇప్పుడు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ రైతులపై ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కపట ప్రేమ తప్ప నిజమైన చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది

ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ "రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది" అని అన్నారు.గ్రామాల్లో రైతు తన పంటలను సుభిక్షంగా పండించుకోవాలంటే సరైన సమయంలో సరైన స్థాయిలో సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు రైతుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వర్యులు అయిన శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని రాజీవ్ రెడ్డి గుర్తుచేశారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, పంటల బీమా, పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీల వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత వైయస్ జగన్ గారిదేనన్నారు.రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు?అమ్మకాల ప్రక్రియను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పంటలకు గిట్టుబాటు ధర, పెట్టుబడి సహాయం, పంటల బీమా వంటి అనేక ప్రయోజనాలు కల్పించిన ప్రభుత్వం వైయస్ జగన్ ప్రభుత్వమని తెలిపారు.ఖరీఫ్ పంటలకు సాగునీరు విడుదల చేయాలని వినతిఎమ్మిగనూరు నియోజకవర్గంలోని రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజీవ్ రెడ్డి గారు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి తదితర పంటలు సాగు చేసుకోవడానికి అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేయాలని రైతులు కోరుతున్నారని పేర్కొన్నారు.తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ రైతులకు అనుకూలంగా సాగునీటిని విడుదల చేయకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. తుంగభద్ర జలాశయంలో ఆంధ్రప్రదేశ్‌కు లభించే వాటా నుంచి ఖరీఫ్ పంటలకు అవసరమైన నీటిని కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు.రైతులు ఇప్పటికే పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాల కోసం ఖర్చు చేశారని, ఈ సమయంలో సాగునీరు అందకపోతే రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పంటలు ఎండిపోతే రైతుల మరింత అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా, అలాగే తుంగభద్ర నది ద్వారా అవసరమైన సాగునీటిని వెంటనే

# 22 ఏ శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు




హైదరాబాద్, తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్న 22ం నిషేధిత భూముల వివాదానికి శాశ్వత ముగింపు పలికేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. నిషేధిత భూముల వివాదం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారానికి దారి తీసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శల దాడి తీవ్రం చేశాయి. బీఆర్ఎస్ సీనియ్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద నుంచి భారీ సెటిల్మెంట్‌లు, 30 శాతం కమిషన్లు, వసూలు చేయడానికే ఉద్దేశపూర్వకంగా ఈ ప్రైవేటు భూములను 22ం జాబితాలోకి నెట్టేసి కృత్రిమ సమస్యలను సృష్టించారని ఆరోపించారు. దీనికి బాధ్యత వహించి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో జోక్యం చేసుకున్న పెద్దలు ఎవరో తేల్చాలని అన్నారు. మరోవైపు బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి కూడా ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన భూలావాదేవీలు, నిషేధిత భూముల జాబితా మార్పుల వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, దీనిపై తక్షణమే సమగ్ర శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తన వద్ద ఉన్న పక్కా ఆధారాలతో తాము చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. ఎటు చూసినా లక్షలాది మంది సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ భూవివాదాన్ని పరిష్కరించడం ద్వారా అటు ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు, ఇటు విపక్షాల విమర్శల దాడికి కూడా అడ్డుకట్ట వేయాలని రేవంత్ రెడ్డి సర్కారు యోచిస్తోంది. 2025 డిసెంబర్‌లో రూపొందించిన నూతన నిషేధిత జాబితాపై సర్వత్రా అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమవుతున్న నేథ్యంలో, ఆ వివాదాస్పద కొత్త జాబితాను పూర్తిగా పక్కన పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ తలనొప్పుల నుంచి బయటపడటానికి 2023 డిసెంబర్ కంటే ముందు అమలులో ఉన్న పాత నిషేధిత జాబితాకే పరిమితం కావడం అత్యుత్తమ మార్గమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ఉన్నతాధికారులు గట్టిగా యోచిస్తున్నారు. ప్రభుత్వం నిబంధనలు, క్రమబద్ధీకరణ జీవోలను సైతం బేఖాతరు చేస్తూ రెవెన్యూ యంత్రాంగం తయారు చేసిన కొత్త జాబితా వల్ల లక్షలాది మంది సామాన్య కొనుగోలుదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులపాలవుతన్నారని తేలడంతో సర్కారు ఈ దిశగా కసరత్తు వేగవంతం చేసింది. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నతాధికారులతో నిర్వహించిన అత్యవసర టెలికాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పక్కా ఆధారాలు ఉన్న భూములకు వెంటనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. నిషేధిత జాబితా అనేది దేవాదాయ, వక్ఫ్ ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సీలింగ్ భూములు, కోర్టు అటాచ్మెంట్లు, పన్ను ఎగవేతల కింద ఉన్న స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ఉద్దేశించిన రక్షణ కవచం. 2007వ సంవత్సరం వరకు ఈ నిషేధిత భూములు అనే అంశంపై పెద్దగా చర్చలు జరిగేవి కావు. అప్పట్లో కేవలం 13. 82 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు, 7.21లక్షల ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాలు, 41. 74 లక్షల ఎకరాల అటవీ భూములు, దేవాదాయ శాఖ పరిధిలోని 74, 128 ఎకరాలు, వక్ఫ్ బోర్డుకు చెందిన 45, 564 ఎకరాలు మాత్రమే ఈ జాబితాలో ఉండేవి. కానీ కాలక్రమేణా పరిధి అడ్డూఅదుపూ లేకుండా విస్తరిస్తూ పోయింది. 2007 నుంచి 2017 మధ్య కాలంలో రాష్ట్రంలో ఉన్న మొత్తం భూముల్లో సుమారు 10 శాతం మాత్రమే 22 ఏ కింద ఉండగా, నేడు అది ఏకంగా 30 నుంచి 40 శాతానికి చేరిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 2025 డిసెంబరులో అనాలోచితంగా రూపొందించిన కొత్త జాబితాలో దశాబ్దాలుగా రైతుల సాగులో ఉన్న వ్యవసాయ భూములు, ఔటర్ రింగ్ రోడ్డు లోపల నిర్మించిన బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, సామాన్యులు కొనుగోలు చేసిన ఓపెన్ ప్లాట్లను కూడా నిషేధిత జాబితాలోకి నెట్టేయడం పెను దుమారానికి దారి తీసింది. కొత్తగా చేర్చిన ప్రైవేటు ఆస్తుల వల్ల రిజిస్ట్రేషన్ లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయి రియల్ ఎస్టేట్ రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న అభ్యంతరాల వల్ల ఈ వారంలోనే వివాదాస్పద కొత్త జాబితాను రద్దు చేసి, 2023 డిసెంబర్ నాటి పాత జాబితా ప్రాతిపదికన మాత్రమే లావాదేవీలు జరపాలని ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. పాత రికార్డుల ప్రకారమే ముందుకు వెళ్లడం వల్ల ప్రస్తుతం తలెత్తిన అనేక వివాదాలు తక్షణమే సమసిపోతాయని అధికారులు గట్టిగా నమ్ముతున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు స్వయంగా చొరవ తీసుకుని బాధితులకు ఫోన్‌ల ద్వారా సమాచారం అందిస్తూ రిజిస్ట్రేషన్లు వేగవంతం చేస్తున్నారు. బాలానగర్ పరిధిలోని సర్వే నంబర్‌లో 101/1, 102/2, 102, 108, 109, 112, 81లలో సుమారు 3 వేల చదరపు మీటర్ల స్థలంపై ఉన్న 22ం నిషేధాన్ని అధికారులు అధికారికంగా తొలగించారు. ఈ సర్వే నంబర్లు పరిధిలోని భూ యజమానులు ఇప్పుడు ఎలాంటి అడ్డంకులు లేకుండా తమ ఆస్తుల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని సబ్‌రిజిస్ట్రార్ ప్రకటించారు. పోచారం గ్రామంలోని సర్వే నెంబర్ 50లో ఉన్న స్థలాన్ని గత డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు భూమిగా చూపిస్తూ పొరపాటున 22ం నిషేధిత జాబితాలో చేర్చారు. దీని వల్ల అక్కడి కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన క్లియరెన్స్ రావడంతో అక్కడ తిరిగి రిజిస్ట్రేషన్లు ప్రక్రియ ప్రారంభించారు.కూకట్‌పల్లి పరిధిలోని అడ్డగుట్ట సొసైటీలో ఉన్న సుమారు 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి ప్రభుత్వం విజయవంతంగా తొలగించింది. ఈ సొసైటీకి చెందిన లబ్ధిదారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను సంస్కరించడానికి ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో అసలు ఏ కేటగిరి కింద ఎంత భూమి 22ం పరిధిలో ఉందో సమగ్ర నివేదిక ఇవ్వాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్‌ను ధరణి కమిటీ కోరింది. అయితే సీసీఎల్‌ఏ నుంచి ధరణి కమిటీకి ఎలాంటి స్పష్టమైన నివేదికలు అందలేదు. నిషేధిత జాబితా రూపకల్పనలో ఎంతటి గందరగోళం, లోపాలు ఉన్నాయో ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది.

# అసెంబ్లీ బహిష్కరణ..మైలేజ్.. డ్యామేజా...



విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాకూడదని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల తర్వాత సభలో తమకు దక్కాల్సిన ప్రతిపక్ష హోదా విషయంలో న్యాయం జరగలేదన్నది వైసీపీ ప్రధాన వాదనగా ఉంది. ఈ అంశాన్నే కేంద్రంగా చేసుకుని అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది. 2024 ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ స్థానాలు మాత్రమే దక్కాయి. కూటమి పార్టీలైన తెలుగుదేశం పార్టీ , జనసేన , బీజేపీ కలిసి భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో శాసనసభలో వైసీపీ సంఖ్యాబలం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత నుంచే ప్రతిపక్ష హోదా అంశం ఆ పార్టీ రాజకీయ చర్చలో కీలకంగా మారింది.వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభలో తమ పార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వం, కూటమి నేతలు మాత్రం ప్రతిపక్ష హోదాకు సంబంధించిన నిబంధనలు, సభలో పార్టీ బలాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ వాదనను అంగీకరించడం లేదు. దీంతో రెండు వైపులా రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.అయితే అసెంబ్లీకి వెళ్లకుండా ఉండటం వల్ల వైసీపీకి రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం కలుగుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాసనసభ ఒక ముఖ్యమైన వేదిక. నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ధరల పెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై అధికార పక్షాన్ని ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష సభ్యులకు ఉంటుంది. అలాంటి అవకాశాన్ని స్వయంగా వదులుకోవడం వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.మరోవైపు వైసీపీ తన రాజకీయ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీకి గైర్హాజరైనప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం కొనసాగించవచ్చు. సోషల్ మీడియా, బహిరంగ కార్యక్రమాలు, పార్టీ సమావేశాలను ఇందుకు ఉపయోగించుకునే అవకాశం ఉందిశాసనమండలిలో మాత్రం వైసీపీకి కొంత బలం ఉండటంతో అక్కడి వేదికను ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకవైపు అసెంబ్లీకి దూరంగా ఉంటూ, మరోవైపు మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం అనే ద్వంద్వ వ్యూహం ఆసక్తిని కలిగిస్తోంది.ఇక వరుసగా సభకు గైర్హాజరైతే సభ్యుల హాజరుకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే గైర్హాజరుపై అనుమతులు, సభా విధానాలు వంటి అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉంటాయి. కాబట్టి కేవలం గైర్హాజరు ఆధారంగా సభ్యత్వంపై తక్షణ నిర్ణయం వస్తుందని భావించడం సరికాదు.మొత్తానికి వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం ఆ పార్టీ రాజకీయ వ్యూహానికి పరీక్షగా మారింది. ప్రతిపక్ష హోదా అంశాన్ని ప్రజల్లోకి ఎంత బలంగా తీసుకెళ్తుంది, అసెంబ్లీకి దూరంగా ఉండటం వల్ల రాజకీయంగా లాభమా నష్టమా అన్నది కాలమే తేల్చనుంది. ప్రజా సమస్యలపై పోరాటానికి సభా వేదికను ఎంచుకుంటుందా, లేక బయట నుంచే ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తుందా అనేది రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.

వైసీపీ రికార్డు

చట్ట సభలే ప్రజాస్వామ్య వేదికలు. అక్కడ అన్ని పక్షాలు కలిసి ప్రజా సమస్యల మీద చర్చిస్తాయి. అలాంటి వేదికలను బహిష్కరించడం అన్నది తొలి తరంలో జరిగేది కాదు, అసలు వాకౌట్లు కూడా అప్పట్లో తక్కువగా ఉండేవి. అయితే రాను రానూ రాజకీయం పెరిగి సభలకే డుమ్మా కొడుతున్నారు. ఇక దేశంలో శాసనసభ మొత్తాన్ని లేదా సమావేశాలను ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పూర్తిగా బహిష్కరించడం అనేది ఎక్కడా లేదని అంటున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్రాల వారీగా అక్కడి రాజకీయ పరిస్థితులు అధికార ప్రతిపక్షాల మధ్య వివాదాలు లేదా సభలో తమకు సముచిత గౌరవం దక్కలేదనే కారణాలపై ఈ బహిష్కరణలు ఆధారపడి ఉంటాయి. మరో వైపు చూస్తే భారతదేశంలో అసెంబ్లీలను బహిష్కరించే పార్టీలు ఉన్నా పాక్షికంగా పరిమితంగా జరిగిన సందర్భాలు ఉన్నాయని అంటున్నారు. కొన్ని సందర్భాలలో ప్రతిపక్ష పార్టీలు నిరసనగా సభలకు దూరంగా ఉంటూ వచ్చిన నేపథ్యం ఉంది. అయితే ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీ మొత్తం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతారాహిత్యంగా అధికార పార్టీలు విమర్శిస్తుంటాయి. సభలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, బహిష్కరణలు సరైనవి కాదని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతుంటారు. ఏపీలో చూస్తే మూడు సందర్భాలలో ముగ్గురు నాయకులు అసెంబ్లీ బహిష్కరణ పిలుపు ఇచ్చారు. వారే ఎన్టీఆర్, జగన్ చంద్రబాబుగా చెప్పాలి మూడున్నర దశాబ్దాల క్రితం చూస్తే ఎన్టీఆర్ 1989లో విపక్షంలో ఉన్నారు. అయితే ఆయన పార్టీకి చెందిన వారు అంతా సభకు హాజరయ్యారు. అప్పట్లో ఉప నాయకులుగా చంద్రబాబు ఇతర నేతలు కలసి టీడీపీని అసెంబ్లీలో నడిపించారు. ఇక జగన్ అయితే 2017లో అసెంబ్లీకి రావడం లేదని ఒక దండం పెట్టి మరీ జనంలోకి పాదయాత్ర కోసం వెళ్లారు. అయితే జగన్ అప్పటికి మూడేళ్ళ పాటు అసెంబ్లీకి హాజరయ్యేవారు. చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయన 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో సభలో తనకు అవమానం జరిగిందంటూ చంద్రబాబు అసెంబ్లీని బహిష్కరించి మళ్లీ అధికారంలోకి వస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి వెలువడిన సందర్భాన్ని రాజకీయ ప్రత్యర్థులు ప్రస్తావిస్తుంటారు ఇక అసెంబ్లీలను బహిష్కరించడం అన్న దానికి బీజం తమిళనాడులో జయలలిత హయాంలో పడింది అని చెప్పాల్సి ఉంటుంది. 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘోర అవమానం కారణంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలిత సభను బహిష్కరించారు. డీఎంకే సభ్యుల దాడిలో అవమానానికి గురైన ఆమెమళ్ళీ ముఖ్యమంత్రిగా అడుగుపెడతాను అని భీష్మ ప్రతిజ్ఞ చేసి సభను వీడారు. ఈ సంఘటన ఆమె రాజకీయ జీవితంలో ఒక కీలక మలుపుగా

# డిజిటల్ కరెన్సీతో పాటు... ఫిజికల్ కరెన్సీకి తగ్గని డిమాండ్

ముంబై ,దేశంలో డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్నప్పటికీ.. నగదుపై ఆధారపడటం మాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్లకు భారీగా డిమాండ్ కొనసాగుతోంది. ఫలితంగా దేశంలో చలామణీలో ఉన్న కరెన్సీ నోట్ల సంఖ్య ఏకంగా 17,600 కోట్లకు చేరుకుంది. భారత కరెన్సీలో తక్కువ విలువ కలిగిన ?1, ?5, ?10, ?20, ?50, ?100, ?200, ?500 నోట్లు పెద్ద మొత్తంలో చలామణిలో ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ గవర్నర్ శిరీష్ చంద్ర ముర్ము వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం దేశంలో సుమారు 17,600 కోట్ల కరెన్సీ నోట్లు ప్రజల వినియోగంలో ఉన్నాయి.అయితే, ఇది ప్రపంచ వ్యాప్తంగా చెలామణిలో ఉన్న డాలర్ నోట్లు 5600 కోట్ల కంటే ఇవి 3 రెట్లు, యూరో నోట్లు 3000 కోట్లు కంటే 6 రెట్లు అధికం కావడం గమనార్హం. జకార్తాలో జరిగిన బ్యాంక్ ఆఫ్ ఇండోనేషియా క్యాష్ మేనేజ్‌మెంట్ సదస్సులో ఈ వివరాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే భారతదేశంలో చలామణిలో ఉన్న నోట్ల సంఖ్య గణనీయంగా ఎక్కువగా ఉండటం ఆసక్తికరంగా మారింది.భారత్‌లో నగదు లావాదేవీల్లో తక్కువ విలువ కలిగిన నోట్ల వినియోగం అధికంగా ఉండటంతో.. వాటి అవసరం కూడా ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా పాత నోట్లు పాడైపోవడం, వినియోగానికి పనికిరాకపోవడం వంటి కారణాలతో వాటి స్థానంలో కొత్త నోట్లను ముద్రించాల్సి వస్తోంది. గణాంకాల ప్రకారం దేశంలో ఏటా దాదాపు 3,000 కోట్ల వరకు కొత్త కరెన్సీ నోట్లు ముద్రిస్తున్నారు. అదే సమయంలో పాడైన, చిరిగిన లేదా వినియోగానికి పనికిరాని సుమారు 2,100 కోట్ల నోట్లను ఏటా ఉపసంహరించి ధ్వంసం చేస్తున్నారు., ఇంటర్నెట్ బ్యాంకింగ్, కార్డులు వంటి డిజిటల్ చెల్లింపు విధానాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ.. దేశంలో నగదు వినియోగం పూర్తిగా తగ్గలేదు. ముఖ్యంగా చిన్న మొత్తాల లావాదేవీలు, గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారాల్లో నగదు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తోంది.డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్న సమయంలోనే నగదు చెలామణి కూడా వృద్ధి చెందడం భారత ఆర్థిక వ్యవస్థలో నగదుకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తోంది. దీంతో ఒకవైపు డిజిటల్ ఎకానమీ విస్తరిస్తుండగా.. మరోవైపు కరెన్సీ నోట్ల అవసరం కూడా కొనసాగుతోంది.నోట్ల ముద్రణ, పాత నోట్ల ఉపసంహరణ, వాటి స్థానంలో కొత్త నోట్లను ప్రవేశపెట్టడం వంటి ప్రక్రియలకు భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలు, నిర్వహణ అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో కరెన్సీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం, నోట్ల జీవితకాలాన్ని పెంచడం వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. డిజిటల్ చెల్లింపుల విస్తరణ కొనసాగుతున్నప్పటికీ.. దేశ ఆర్థిక వ్యవస్థలో నగదు పాత్ర ఇప్పటికీ కీలకంగానే ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి

# సిద్ధాంతాల ఆధారంగానే పదవులు

న్యూఢిల్లీ,భారత రాజకీయాల్లో వారసత్వం, కుటుంబ నేపథ్యం అనేది నాయకత్వ అర్హతగా మారిన తరుణంలో, భారతీయ జనతా పార్టీ మాత్రం కింది స్థాయి కార్యకర్త నుంచి అగ్ర నాయకుడిగా ఎదిగే సిద్ధాంతానికే మొగ్గు చూపుతోంది. ఇటీవల ప్రకటించిన పార్టీ కొత్త జాతీయ కార్యవర్గంలో సైతం ఈ తరహా క్యాడర్-బేస్డ్ లీడర్‌షిప్‌కే అధిష్ఠానం పెద్దపీట వేసింది. కేవలం ఒక పొలిటికల్ ప్యాషన్ , క్రమశిక్షణ, భావజాలం పట్ల అంకితభావంతో పనిచేసే సాధారణ కార్యకర్తకు కూడా నంబర్-1 స్థానాన్ని అధిష్టించే అవకాశం కల్పించడమే తమ శ్రేణుల బలం అని బీజేపీ మరోసారి రుజువు చేసింది.ఈ గ్రాస్‌రూట్ మోడల్‌కు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే అతిపెద్ద ఉదాహరణ. గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, సాదాసీదా కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎదిగిన విధానం బీజేపీ సిద్ధాంతానికి నిలువెత్తు సాక్ష్యం. తాజాగా పార్టీ అత్యున్నత అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన నితిన్ నబీన్ ప్రయాణం కూడా ఇందుకు భిన్నమైనది కాదు. యువజన మోర్చా స్థాయి నుంచి సుదీర్ఘకాలం పాటు క్షేత్రస్థాయిలో చెమటోడ్చి, కష్టపడి పనిచేసిన నైపుణ్యాన్ని గుర్తించే పార్టీ జాతీయ నాయకత్వ పగ్గాలను ఆయనకు అప్పగించింది.కొత్త జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎంపికైన రామ్ మాధవ్ , ఆల్ సెల్స్ కో కన్వీనర్‌గా స్థానం పొందిన విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతల ప్రయాణం ఆర్ఎస్ఎస్, ఏబీవీపీల పునాదుల మీదే సాగింది. రామ్ మాధవ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో క్షేత్రస్థాయి స్వయంసేవక్‌గా పొలిటికల్ డిప్లొమసీని, సిద్ధాంత పటిష్టతను నేర్చుకుని బీజేపీ జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారారు. అలాగే ఏపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి విభాగమైన ఏబీవీపీ ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి చేరుకున్నారు. ఇవి కేవలం ఉద్యోగ బాధ్యతలు కావు, సిద్ధాంతం పట్ల ఉండే 'ప్యాషన్'.అధికార మార్పిడి , పదవుల పంపకంలో వారసత్వ రాజకీయాల ను పూర్తిగా పక్కనపెట్టడం బీజేపీకి సంస్థాగతంగా కొన్ని ప్రధాన ప్రయోజనాలను తెచ్చిపెడుతోంది. ఏ మూలన ఉన్న సాధారణ శ్రేణి నేతలకైనా, నేను కూడా రేపు జాతీయ స్థాయి నేతను కాగలను అనే ఆశ, ఉత్సాహం నిరంతరం పని చేసేలా ప్రేరేపిస్తాయి. పక్షపాతం లేకుండా పనితీరు, ఫలితాలే ప్రాతిపదికగా ప్రమోషన్లు ఇవ్వడం వల్ల పార్టీ నడిపించే వ్యూహకర్తలకు క్షేత్రస్థాయి సమర్థత దక్కుతుంది. ప్రత్యర్థి పార్టీలలో నడుస్తున్న కుటుంబ పాలన ను నిలదీసే నైతిక బలం ఒక్క బీజేపీకే సాధ్యమవుతుంది. ఈ గ్రాస్‌రూట్ నాయకత్వ నమూనాలో కొన్ని అంతర్గత సవాళ్లు కూడా లేకపోలేదు. క్షేత్రస్థాయి నుంచి కష్టపడి వచ్చిన నేతలకు సిద్ధాంతపరమైన నిబద్ధత ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో విభిన్న సామాజిక సమీకరణాలను, గ్లామరస్ పాపులిజమ్‌ను తట్టుకుని ఓట్లుగా మలచడం ఒక్కోసారి క్లిష్టంగా మారుతుంది. అంతేకాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చే మాస్ లీడర్లకు, కింది స్థాయి నుంచి ఎదిగిన ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న 'ఆర్గనైజేషనల్' నేతలకు మధ్య సమన్వయం కుదర్చడం జాతీయ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారుతుంటుంది. బీజేపీ నిలకడగా విజయం సాధించడానికి, ఇతర ప్రాంతీయ పార్టీల వలె ఏ ఒక్క కుటుంబం చేతిలో చిక్కుకోకుండా ఉండటానికి ఈ బాటమ్-టు-టాప్ విధానమే మూలస్తంభం. రాజకీయాన్ని వ్యాపారంగా కాకుండా ఒక బాధ్యతగా, ప్యాషన్‌గా భావించి రూట్ లెవెల్ నుంచి కష్టపడే వారికి బీజేపీలో ఎల్లప్పుడూ ప్రాధాన్యత దక్కుతుందనే సందేశాన్ని సరికొత్త జాతీయ కార్యవర్గ ఎంపిక మరోసారి స్పష్టంగా చాటిచెప్పింది.

# ఆరు చోట్ల ఈడీ సోదాలు

కడప,మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి హైదరాబాద్, కడపలో మొత్తం ఆరు చోట్ల ఈడీ సోదాలు కొనసాగాయి. కడపలోని అవినాష్ రెడ్డి నివాసం సహా మరో మూడుచోట్ల ఈడీ సోదాలు జరిగాయి. సీబీఐ కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. కేసులో రాజకీయ నేతల ప్రమేయం, మనీలాండరింగ్ పై ఈడీ ఆరా తీస్తోంది. హత్యకు ముందు నగదు లావాదేవీల వ్యవహారం బయటకు రావడంతో దర్యాప్తు ప్రారంభమయింది. సీబీఐ దర్యాప్తు సమయంలో బయటకొచ్చిన అంశాలపై మరింత విచారణ జరుగుతోంది. నిందితులకు ఇచ్చిన రూ. 4 కోట్లు ఎక్కణ్నుంచి, ఎలా వచ్చిందన్న అంశంపై దర్యాప్తు జరుగుతున్నట్లు సమాచారం.

# హైదరాబాద్‌లో ఆల్‌టైమ్ రికార్డ్.. రాయదుర్గంలో ఎకరం భూమి ధర రూ.264 కోట్లు



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని రాయదుర్గంలో ఎకరం భూమి గత రికార్డులను బద్దలు కొడుతూ భారీ ధర పలికింది. పాన్‌మక్తా ప్రాంతంలోని సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎకరా రికార్డు స్థాయిలో రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది.మొత్తం 5.25 ఎకరాలూ ఆ సంస్థే దక్కించుకుంది. ఇదే సర్వే నంబర్‌లో ఈ సంవత్సరం మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. 3 నెలల క్రితంతో పోలిస్తే రూ.27 కోట్ల అధికంగా లభించినట్లయింది. రూ.10కోట్ల రూపాయలు చెల్లించి పలు స్థిరాస్తి సంస్థలు ఆన్ లైన్ బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. ప్రారంభ ధర 175 కోట్ల రూపాయల నుంచి బిడ్డింగ్ ప్రారంభమైంది. కనీసం కోటి రూపాయలు అధికంగా బిడ్డింగ్ వేయాల్సి ఉండటంతో పలు సంస్థలు పోటీపడి మరీ బిడ్డింగ్ దాఖలు చేశాయి. చివరికి ఎంఎస్ఎన్ రియల్టీ కంపెనీ రూ.264 కోట్లు అధికంగా బిడ్డింగ్ దాఖలు చేయడంతో ఆ కంపెనీని టీజీఐఐసీ అధికారులు ఎంపిక చేశారు. దీంతో టీజీఐఐసీకి రూ.1381 కోట్లు ఆదాయం సమకూరినట్లయింది. ఐటీ కారిడార్ కావడంతో ఆ ప్రాంతంలో భూమికి ఎంతో విలువ ఉంది. ఇప్పటికే పలు బహుళ అంతస్తుల భవనాల్లో అంతర్జాతీయ కంపెనీల కార్యాలయాలు కొనసాగుతున్నాయి. జీసీసీ, ఐటీ కంపెనీలు, ఇతర కార్పొరేట్ కార్యాలయాలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయి.భారీ డిమాండ్‌కు కారణం : రాయదుర్గం ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలుండటంతో బహుళజాతి కంపెనీలు కార్యాలయాల ఏర్పాటు కోసం లీజు, లేదా అద్దెకు తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. బెంగళూరు, పుణె, ముంబయి, దిల్లీతో పోలిస్తే కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువగా ఉండటం, మానవ వనరుల లభ్యత ఎక్కువగా ఉండటంతో జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. దీంతో స్థిరాస్తి సంస్థలు విశాలమైన స్థలాలు కొనుగోలు చేసి భారీ ఆకాశహర్మ్యాలను నిర్మించి లీజుకు ఇస్తున్నాయి. టీజీఐఐసీ వేలం వేసే భూములకు సంబంధించి వివాదాలు ఉండవనే ఉద్దేశంతో స్థిరాస్తి సంస్థలు విలువైన భూములను దక్కించుకోవడానికి పోటీ పడుతున్నాయి. దీంతో ఎకరం ధర గత రికార్డు బద్దలుకొట్టి రూ.264 కోట్ల పలికింది.

# చక్కెరపై కృత్రిమ కొరత.. అందుకే ధరలు పెరిగాయి



న్యూఢిల్లీ: చక్కెరను ఇథనాల్ తయారీకి మళ్లించడం వల్లే దేశంలో చక్కెర ధరలు భారీగా పెరుగుతున్నాయన్న వాదనలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. దేశీయ అవసరాలకు సరిపడా చక్కెర నిల్వలు ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు ధరలను పెంచుతున్నారని ఆరోపించింది. నిల్వలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. చక్కెర లభ్యత, ధరలపై శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించిన కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా.. దేశంలో చక్కెర నిల్వలు తగినంతగా ఉన్నాయని స్పష్టం చేశారు. ధరల నియంత్రణకు ముందస్తు చర్యగా అక్టోబర్ 31లోగా 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుమతించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా చక్కెర సగటు రిటైల్ ధర జూలై 20న కిలోకు రూ.48 ఉండగా.. ప్రస్తుతం రూ.56కు చేరిందని చోప్రా తెలిపారు. కేవలం 10 రోజుల్లోనే ఎక్స్ మిల్ ధర రూ.47 - 48 నుంచి రూ.62కు పెరిగిందని, ఇంత భారీ పెరుగుదలకు ఎలాంటి సమర్థన లేదని అన్నారు. ఈ విషయంపై చక్కెర పరిశ్రమకు చెందిన ఐఎస్ఎంఏ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ (ఎన్ఎఫ్ఎస్‌సీఎఫ్) ప్రతినిధులతో సమావేశమైనట్లు తెలిపారు. ఇంత తక్కువ సమయంలో ఎక్స్-మిల్ ధరలను భారీగా పెంచడం "అంగీకారయోగ్యం కాదు" అని పరిశ్రమ ప్రతినిధులకు స్పష్టం చేసినట్లు చెప్పారు. చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ తయారీ కోసం చక్కెరను మళ్లించడమే కారణమని చెప్పడం సరికాదని చోప్రా అన్నారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెర మళ్లింపు వల్ల చక్కెర పరిశ్రమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరగడానికి కూడా ఇది సహాయపడిందని వివరించారు. 2025 - 26 మార్కెటింగ్ సీజన్‌లో ఇప్పటివరకు 28 లక్షల టన్నుల చక్కెరను ఇథనాల్ తయారీకి మళ్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇథనాల్‌లో కేవలం నాలుగో వంతు మాత్రమే చక్కెర ఆధారంగా తయారవుతోందని, మిగిలినది ప్రధానంగా మొక్కజొన్న వంటి ధాన్యాల నుంచి ఉత్పత్తి అవుతోందన్నారు.

33 - 35 లక్షల టన్నుల నిల్వలు మిగిలే అవకాశం

2025 - 26 మార్కెటింగ్ సంవత్సరంలో చక్కెర ఉత్పత్తి గత అంచనా 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు తగ్గిందని చోప్రా తెలిపారు.

# రేవంత్ అమెరికా పర్యటన ఎందుకు ఆగిపోయింది?

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన విదేశీ పర్యటనలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకురావడం.. అంతర్జాతీయ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలు పెంచుకోవడమే లక్ష్యంగా లండన్, అమెరికా పర్యటనలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర విదేశాంగ శాఖ.. అమెరికా పర్యటనకు మాత్రం పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వలేదు. దీంతో అమెరికా షెడ్యూల్‌ను రేవంత్ రెడ్డి రద్దు చేసుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది.ఈ వ్యవహారంపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రులే కాకుండా ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలను కూడా విదేశాంగ శాఖ సమీక్షిస్తుందని తెలిపారు. ప్రతిపాదిత పర్యటన కార్యక్రమాలు సదరు వ్యక్తి పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాల్సి ఉంటుందని.. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలకు అనుగుణంగా షెడ్యూల్ లేదని చెప్పారు. అందుకే అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వలేదని.. అయితే బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని స్పష్టం చేశారు.

అమెరికా షెడ్యూల్‌లో రాజకీయ కార్యక్రమం

రేవంత్ రెడ్డి అమెరికాలో హార్వర్డ్, ఎంఐటీ, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించాల్సి ఉంది. పెట్టుబడులు, విద్యా రంగంలో భాగస్వామ్యాలు, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చలు జరపాలని ప్రభుత్వం భావించింది. అయితే న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించనున్న మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం కూడా ఆయన షెడ్యూల్‌లో ఉంది.ఇదే అంశం రాజకీయంగా కీలకంగా మారినట్లు చర్చ జరుగుతోంది. అధికారిక పెట్టుబడుల పర్యటనతో పాటు రాజకీయ స్వభావం ఉన్న కార్యక్రమం ఉండటంపై కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే కేంద్రం మాత్రం రేవంత్ పర్యటనను రాజకీయ కారణాలతో అడ్డుకున్నామని స్పష్టంగా చెప్పలేదు. ప్రతిపాదిత కార్యక్రమం ఆయన పదవికి, పర్యటన ఉద్దేశానికి తగినట్లుగా లేదన్నదే విదేశాంగ శాఖ అధికారిక వివరణ ఇచ్చింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణదీర్ జైస్వాల్ ప్రకటన చేశారు..

సీఎంల విదేశీ పర్యటనలకు కేంద్ర అనుమతి ఎందుకు?

భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్ ప్రకారం విదేశీ వ్యవహారాలు కేంద్ర జాబితాలో ఉన్నాయి. విదేశీ ప్రభుత్వాలతో సంబంధాలు, దౌత్య వ్యవహారాలు, అంతర్జాతీయ ఒప్పందాలు వంటి అంశాలు కేంద్ర పరిధిలో ఉంటాయి. అందువల్ల ముఖ్యమంత్రులు, మంత్రులు అధికారిక హోదాలో విదేశాలకు వెళ్లేటప్పుడు కేంద్ర ప్రభుత్వ నిర్దేశించిన విధానాల ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.ముఖ్యంగా విదేశాంగ శాఖ నుంచి పొలిటికల్ క్లియరెన్స్ కీలకం. పర్యటనలో పాల్గొనే సంస్థలు, సమావేశాలు, ఆహ్వానించిన వ్యక్తులు, కార్యక్రమాల స్వభావం తదితర అంశాలను కేంద్రం పరిశీలిస్తుంది. అవసరాన్ని బట్టి ఇతర కేంద్ర శాఖల నుంచి కూడా అనుమతులు, సమాచారం లేదా క్లియరెన్స్ అవసరం కావచ్చు.

కేంద్రం ఎప్పుడు అనుమతి నిరాకరిస్తుంది?

విదేశీ పర్యటన వల్ల దేశ విదేశాంగ విధానానికి విరుద్ధమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని కేంద్రం భావించినప్పుడు అనుమతి నిరాకరించవచ్చు. విదేశీ సంస్థల నేపథ్యం, కార్యక్రమాల స్వభావం, భద్రతాపరమైన అంశాలు, అంతర్జాతీయ పరిస్థితులు, పర్యటన ఉద్దేశం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.



అదేవిధంగా అధికారిక పర్యటన పేరుతో విదేశాల్లో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం లేదా కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానానికి భిన్నమైన సందేశం వెళ్లే అవకాశం ఉందని భావించినా అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు.రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విషయంలోనూ న్యూయార్క్‌లోని రాజకీయ కార్యక్రమం కారణంగానే కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసి ఉండొచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై కేంద్రం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన రాజకీయ కారణం వెల్లడికాలేదు.

గతంలోనూ ఇలాంటి ఘటనలు

విదేశీ పర్యటనలకు కేంద్రం అనుమతి నిరాకరించిన ఘటనలు గతంలోనూ ఉన్నాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు కొన్ని అంతర్జాతీయ సదస్సులకు వెళ్లేందుకు అనుమతి విషయంలో వివాదాలు తలెత్తాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విదేశీ పర్యటనలకు సంబంధించిన కొన్ని సందర్భాల్లోనూ కేంద్రం నుంచి క్లియరెన్స్ లభించలేదు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల పర్యటనల విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.అందువల్ల రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ పూర్తిగా కొత్త పరిణామం కాదు. అయితే ఒకవైపు బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. మరోవైపు అమెరికా పర్యటనను తిరస్కరించడం మాత్రం ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది.

కేంద్ర అనుమతి లేకుండా వెళ్తే?

కేంద్రం నుంచి అధికారిక క్లియరెన్స్ లేని పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించడం, విదేశీ ప్రభుత్వాలతో అధికారిక చర్చలు జరపడం వంటి అంశాలు సమస్యాత్మకంగా మారవచ్చు. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు సాధారణంగా అధికారిక పర్యటనలకు అవసరమైన ప్రోటోకాల్, సమన్వయం, భద్రతా ఏర్పాట్లను కేంద్ర అనుమతుల ఆధారంగానే నిర్వహిస్తాయి.అందుకే అధికారిక పర్యటనకు కేంద్ర అనుమతి లేకపోతే షెడ్యూల్‌ను రద్దు చేయడం లేదా మార్చుకోవడం సాధారణంగా జరుగుతుంది. వ్యక్తిగత హోదాలో విదేశాలకు వెళ్లడం వేరు.. ముఖ్యమంత్రిగా అధికారిక పర్యటన చేయడం వేరు.మొత్తానికి రేవంత్ రెడ్డి అమెరికా టూర్ రద్దు వెనుక అసలు కారణం ఏమిటన్నదానిపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాజకీయ కక్షతోనే కేంద్రం అనుమతి నిరాకరించిందని ఆరోపిస్తుండగా.. కేంద్ర విదేశాంగ శాఖ మాత్రం పర్యటన షెడ్యూల్, దాని ఉద్దేశం, కార్యక్రమాల స్వభావం తమ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతోనే క్లియరెన్స్ ఇవ్వలేదని చెబుతోంది. దీంతో రేవంత్ అమెరికా పర్యటన రద్దు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరో వివాదానికి కేంద్రబిందువుగా మారింది.

# అమాత్యుల మౌనం వెనక అంతర్యం ఏమిటి ?

హైదరాబాద్,తెలంగాణ అటవీశాఖ మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిల మీద చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ సర్కారును కుదిపేస్తున్నాయి. తన కూతురు వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వివరణ ఇవ్వగా, తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, తన టార్గెట్ కాంగ్రెస్ పార్టీ కాదని, తాను రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు విధేయురాలినని, రేవంత్ రెడ్డి మీదనే తన పోరాటం అని కొండా సుష్మిత పునరుద్ఘాటించింది.ఈ నేపథ్యంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి మద్దతుగా 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని, ఆమెతో పాటు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిల మీదా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఇప్పటి వరకు రేవంత్ రెడ్డికి మద్దతుగా 14 మంది మంత్రులలో ఒక్కరు కూడా బయటకు వచ్చి మద్దతుగా మాట్లాడకపోవడం వెనక అంతర్యం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న ఎమ్మెల్యేల మద్దతు ఇంతేనా అన్న ప్రశ్నలు కూడా ఉదయిస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీకి శాసనసభలో సొంతంగా 66 మంది సభ్యుల బలం ఉంది. కానీ నిన్నటి సమావేశానికి 17 మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. వీరితో పాటు ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బస్వరాజు సారయ్యలు ఉన్నారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, రేవూరి ప్రకాశ్ రెడ్డి, బాలు నాయక్, చిక్కుడు వంశీకృష్ణ, మనోహర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కె.ఆర్. నాగరాజు, రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, బి. లక్ష్మ రెడ్డి, వెడ్మ బొజ్జు, మందుల సామెల్ హాజరయ్యారు.మరి మిగతా ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకు బయటకు రావడం లేదు ? వారంతా రేవంత్ రెడ్డికి వ్యతిరేకమా ? లేక నిశితంగా పరిణామాలను పరిశీలిస్తూ అధిష్ఠానం ఆదేశాల





ప్రకారం నడుచుకునేందుకు వేచి చూస్తున్నారా అన్న చర్చ జరుగుతుంది. అయితే నిన్నటి పరిణామాల నేపథ్యంలో సీఎం సొంత జిల్లా మహబూబ్ నగర్, పొంగులేటి మద్దతు దారులుగా ముద్రపడ్డ నల్లగొండ ఎమ్మెల్యేలు, కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారని అంటున్నారు.ముఖ్యమంత్రి మీద ఇంతటి తీవ్ర ఆరోపణలు వచ్చినా ఒక్క మంత్రి కూడా నోరుమెదపకపోవడం ఏంటన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో సుష్మిత ఆరోపణలు చేసినప్పుడు కూడా ఎవరూ స్పందించలేదు. తాజా పరిణామాల నేపథ్యంలోనూ అదే పరిస్థితి నెలకొంది.మరోవైపు కొండా సురేఖ బీసీ సామాజికవర్గానికి చెందిన బలమైన నేత కావడం, వరంగల్ జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ప్రభావితం చూపే అవకాశం ఉండటంతో ఆమె మీద చర్యలు తీసుకునే విషయంలో అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తుందని అంటున్నారు. దీంతో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డిల మీద ఎలాంటి చర్యలు తీసుకోకుండా కొండా సురేఖ మీద చర్యలు తీసుకుంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఆలోచన కూడా ఉంది.సీఎం రేవంత్ రెడ్డి రేపు లండన్ నుండి తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు. ఆ తర్వాత జరిగే పరిణామాలు ఎలా ఉంటా యి ? కొండా సురేఖను తొలగిస్తారా ? లేక హెచ్చరించి వదిలేస్తారా ? అన్నది వేచిచూడాలి.

# మేడారంలో మధుర విప్లవం..ఇప్ప పువ్వు లడ్డూకు పెరిగిన క్రేజ్



మేడారం:నోరూరించే 'లడ్డూ' పేరు వినగానే జిహ్వా చాపల్యం కలగని తీపి ప్రియులు ఉండరంటే అతిశయోక్తి కాదు. అయితే, అదే లడ్డూ అడవితల్లి ప్రసాదించిన ఔషధాల గనితో తయారైతే? ఒకప్పుడు కేవలం నాటుసారా తయారీకే పరిమితమనుకున్న అటవీ సంపద, నేడు పంచదార లేని అమృత గుళికగా మారి జిహ్వాను సంతృప్తి పరుస్తుండటం విశేషం. గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క-సారలమ్మల పవిత్ర క్షేత్రం మేడారంలో ప్రస్తుతం ఈ సరికొత్త లడ్డూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.అటవీ అమృతం.. ఇప్ప పువ్వు విశిష్టత : మాఘ మాసం ప్రవేశించగానే దండకారణ్యాల్లోని ఇప్ప చెట్లు పూల సువాసనలతో పులకరిస్తాయి. తెల్లవారుజామునే నేలరాలే ఈ పువ్వులను సేకరించడం గిరిజనుల దైనందిన జీవితంలో ఒక భాగం. ఆయుర్వేద పరంగా ఇప్ప పువ్వుకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. ఇందులో సహజసిద్ధమైన ఐరన్, కాల్షియం, ప్రొటీన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. రక్తహీనతను నివారించడంలో, ఎముకల పుష్టికి, శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇప్ప పువ్వు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పూర్వం నుంచి గిరిజనులు దీనిని నానబెట్టి సంప్రదాయ పానీయంగా వినియోగించేవారు; నేడు కాలంతో పాటు మారిన ఆలోచనలు దీనిని అద్భుతమైన పోషకాహారంగా మార్చాయి.సంప్రదాయం ం ఆధునికత: లడ్డూ తయారీ విధానం : మేడారం పరిసర అటవీ ప్రాంతాల నుంచి సేకరించిన తాజా ఇప్ప పువ్వులను ఎండబెట్టి, శుభ్రపరిచి నిల్వ చేస్తారు. అనంతరం తయారీ ప్రక్రియను అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో చేపడతారు. ఎండిన ఇప్ప పువ్వుల్లోని తేమను పూర్తిగా తొలగించి, స్వచ్ఛమైన ఆవు నెయ్యిలో దోరగా వేయిస్తారు. వేయించిన పువ్వులకు పల్లీలు (వేరుశనగలు), నువ్వులు, బాదం, జీడిపప్పు తదితర డ్రైఫ్రూట్స్ పొడిని జోడిస్తారు. ఎలాంటి రిఫైన్డ్ పంచదారను వాడకుండా, సేంద్రీయ తాటి బెల్లం, అటవీ స్వచ్ఛమైన తేనెను పాకంగా పట్టి మిశ్రమంలో కలుపుతారు. ఈ పోషక మిశ్రమాన్ని గుండ్రటి లడ్డూలుగా చుట్టి ప్యాక్ చేస్తారు. ఈ సహజ ప్రక్రియ వల్ల మధుమేహం (షుగర్) ఉన్నవారు, రక్తపోటు బాధితులు సైతం ఎలాంటి సంకోచం లేకుండా ఈ లడ్డూలను ఆస్వాదించగలుగుతున్నారు.'సెర్ప్', మంత్రి సీతక్క తోడ్పాటు: మహిళా సాధికారతకు సరికొత్త చిరునామా, ఒకప్పుడు కేవలం గృహావసరాలకే పరిమితమైన ఈ వంటకం, నేడు గిరిజన మహిళల ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాదిగా మారింది. (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ - సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) అందించిన నాణ్యతా శిక్షణ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మేడారం లో స్వయం సహాయక సంఘాల మహిళలకు విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. మేడారం సమ్మక్క-సారలమ్మల ఆలయ పరిసరాల్లో, భక్తులు బయటకు వెళ్లే ప్రధాన మార్గాల్లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు నడుస్తున్నాయి. ఇక్కడ ఇప్ప పువ్వు లడ్డూలతో పాటు, తాటి బెల్లంతో చేసిన భక్షాలు (బొబ్బట్లు) కూడా హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.మేడారంలో పెరుగుతున్న డిమాండ్ : అమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తులు ప్రసాదంతో పాటు ఆరోగ్యాన్ని అందించే ఈ ఇప్ప లడ్డూలను ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. అటవీ ఉత్పత్తులకు ఆధునిక మార్కెటింగ్ మెరుగులు అద్దితే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో మేడారంలో లభిస్తున్న స్పందన నిరూపిస్తోంది. రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం అందించడమే కాకుండా, ఆదివాసీ మహిళల జీవితాల్లో సిరులు కురిపిస్తున్న ఈ 'ఇప్ప పువ్వు లడ్డూ' నిజంగా ప్రకృతి ప్రసాదించిన ఓ అద్భుత వరం.

**ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో దర్యాప్తు ముమ్మరం**

కాకినాడ,గోదావరి నదిలో దూకిన ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసారు. నిందితుడు సాదిక్ఖాన్ కోసం 10 ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. సాధిక్ ఖాన్ పాస్పోర్టును సీజ్ చేసి నిందితుడు ఎక్కడికీ పారిపోకుండా లుకౌట్ సర్క్యులర్ జారీ చేసారు. నూకరాజు కుమార్తె రాసిన లేఖలపై దర్యాప్తు ముమ్మరం. మతం మారాలి ఇస్లాం పుస్తకాలు చదవాలంటూ సాధిక్ ఖాన్ వేధించినట్లు లేఖలో సౌజన్య పేర్కొంది. సాధిక్ ఖాన్ కాల్డేటా ఆధారంగా పలువురిని పోలీసులు విచారించారు. పోలీసులు. నిందితుడు సాదిక్ఖాన్ ఆచూకీ తెలిపితే రివార్డ్ ఇస్తామని ప్రకటించారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో మీనాక్షి మార్క్ విఫలం !



హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు చేపట్టినప్పుడు పార్టీని గాడిలో పెడతారని... గాడి తప్పిన వారిని ఉపేక్షించరని అందరూ అనుకున్నారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితురాలిగా, అవినీతి మచ్చ లేని కఠినమైన నాయకురాలిగా పేరుండటంతో రాష్ట్రంలో క్రమశిక్షణారాహిత్యానికి అడ్డుకట్ట వేస్తారని అంతా భావించారు. అయితే,...తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు చేపట్టినప్పుడు పార్టీని గాడిలో పెడతారని... గాడి తప్పిన వారిని ఉపేక్షించరని అందరూ అనుకున్నారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితురాలిగా, అవినీతి మచ్చ లేని కఠినమైన నాయకురాలిగా పేరుండటంతో రాష్ట్రంలో క్రమశిక్షణారాహిత్యానికి అడ్డుకట్ట వేస్తారని అంతా భావించారు. అయితే, తెలంగాణ కాంగ్రెస్ నాయకుల సొంత ఎజెండాలు, అంతర్గత ముఠా తత్వాల ముందు ఆమె వ్యూహాలు తేలిపోయినట్లు కనిపిస్తోంది. పదవి చేపట్టిన నాటి నుంచి కఠిన నిర్ణయాలు తీసుకోకుండా బుజ్జగింపు రాజకీయం అనుసరించడంతో నేతలు ఆమె ఆదేశాలను పట్టించుకోవడం లేదు.

ఎవరు గీత దాటినా మౌనమే

సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, క్రమశిక్షణ తప్పిన నేతలపై వెంటనే వేటు వేయడంలో ఆమె వైఖరి మరీ మెతకగా ఉందనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో బలపడింది. అంతర్గత విభేదాలు రచ్చకెక్కిన ప్రతిసారీ కమిటీల ఏర్పాటు లేదా చర్చల పేరుతో కాలాన్ని వెళ్లదీయడమే తప్ప, గట్టి చర్యలు లేకపోవడంతో అసమ్మతి నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు. చివరికి సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ స్థానాన్ని కైవసం చేసుకునే విషయంలోనూ పార్టీ అంతర్గత సమీకరణాలను తట్టుకోలేక పదవిని కోల్పోవాల్సి రావడం ఆమె రాజకీయ ప్రతిష్టకు తీవ్ర విఘాతం కలిగించింది.

కొండా సురేఖపై గతంలోనే చర్య తీసుకుంటే ఈ పరిస్థితి వచ్చేదా?

తాజాగా మంత్రి కొండా సురేఖ , ఆమె కుటుంబ వ్యవహార శైలిపై రగులుతున్న వివాదంలోనూ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పాత్ర దాదాపు శూన్యంగా మారింది. సురేఖ చేసిన వరుస వివాదాస్పద వ్యాఖ్యలు, ఆమె అనుచరుడు సుమంత్‌పై వస్తున్న ఆర్థిక సెటిల్‌మెంట్ల ఆరోపణలు పార్టీకి, ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నప్పటికీ అధిష్టాన స్థాయి నుంచి గట్టి కౌంటర్ ఇవ్వడంలో ఆమె నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు. పీసీసీ వర్గాలు ఒకవైపు కఠిన నివేదికలు సిద్ధం చేస్తుంటే, ఇన్‌ఛార్జ్ మాత్రం ఎలాంటి స్పష్టమైన దిశానిర్దేశం చేయలేక చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

ఇప్పుడు కూడా పట్టించుకుంటున్నది అంతంతమాత్రమే!

మొత్తానికి, ఎంతటి వర్గపోరునైనా అదుపు చేయవచ్చనే అంచనాలతో వచ్చిన మీనాక్షి నటరాజన్, తెలంగాణ కాంగ్రెస్ నాయకుల నడుమ తన సూపర్ పవర్ సామర్థ్యాన్ని చాటుకోవడంలో విఫలమయ్యారనేది స్పష్టమవుతోంది. కఠిన నిర్ణయాలు తీసుకోకుండా సాగదీసే ధోరణి వల్లనే ప్రస్తుతం మంత్రి కొండా సురేఖ ఉదంతం అధిష్టానానికి, రేవంత్ సర్కారుకు పెద్ద తలనొప్పిగా మారింది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140